

ఏకలవ్య ప్రవేశ పరీక్ష వాయిదా

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలోని భామిని, మెళియాపుట్టి ఏకలవ్య పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం ప్రవేశానికి నిర్వహించాల్సిన పరీక్షను వాయిదా వేసినట్లు జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు అన్నదొర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను 6,7,8,9 తరగతిలో మిగిలి ఉన్న సీట్ల ప్రవేశానికి ఈ నెల 13న ప్రవేశ పరీక్ష నిర్వహించాల్సి ఉందన్నారు. అయితే గురుకుల కార్యదర్శి ఆదేశాల మేరకు ఈ నెల 20న ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న వారు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

5 ఏళ్లు సరిపోలేదా?

- తోటపల్లిపై వైసీపీ సర్కారు నిర్లక్ష్యం
- సకాలంలో బిల్లులు చెల్లించని వైనం
- నిధుల కోసం అధికార యంత్రాంగం నిరీక్షణ
- ఆధునికీకరణకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
- వచ్చే నెలతో ముగియనున్న గడువు
- ఆ లోగా పనులు పూర్తవడం కష్టమే..
- ఆందోళనలో రైతులు
- ఈ ఏడాదీ ఖరీఫ్ కష్టాలు తప్పేలా లేవని ఆవేదన

(గరుగుబిల్లి)

'మాది రైతు ప్రభుత్వం.. సాగునీటి ప్రాజెక్టుల పనులన్నీ పూర్తి చేసి.. ప్రతి ఎకరాకూ నీరందిస్తాం.. సాగులో అన్నదాతలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం'.. అని ఐదేళ్ల పాటు సీఎం జగన్ చెప్పుకొచ్చారు. అయితే ఆచరణలో మాత్రం భిన్నంగా వ్యవహరించారు. దీంతో క్షేత్రస్థాయిలో అన్నదాతలకు కష్టాలు తప్పడం లేదు. సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి పెద్దపీట వేశామని చెబుతున్న సర్కారు.. జిల్లాలో తోటపల్లిపై మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. నిధుల విడుదలకు శ్రద్ధ చూపలేదు. ప్రధానంగా పూర్తయిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఆధునికీకరణకు మోక్షం లభించడం లేదు. ప్రస్తుతం కాంట్రాక్టర్లు పూర్తిగా చేతులెత్తేశారు. ఒక వైపు ఎన్నికలు.. మరోవైపు నిధుల సమస్య కారణంగా.. గడువులోగా ఆధునికీకరణ పూర్తయ్యేలా కనిపించడం లేదు. కాగా ఖరీఫ్‌కు కూడా సమయం దగ్గర పడుతుండడంతో .. రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది కూడా సాగునీటి కష్టాలు తప్పేలా లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పాత రెగ్యులేటర్ పరిధిలోని రెండు కాలువల ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు 2018లో సుమారు రూ. 193 కోట్లు మంజూరు చేశారు. అదే ఏడాది నవంబరులో పనులు ప్రారంభించారు. 2019 మే వరకు పనులు చురుగ్గా నిర్వహించారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం పాలన పగ్గాలు చేపట్టడంతో ఆధునికీకరణకు కష్టాలు మొదలయ్యాయి. ముందుగా రూ.14 కోట్లకు పైగా నిధులతో 32 శాతం మేర పనులను కాంట్రాక్టర్లు నిర్వహించారు. ఎడమ ప్రధాన కాలువకు సంబంధించి 37.62 కిలో మీటర్లకు గాను 16 కిలో మీటర్లు, కుడి కాలువకు సంబంధించి 17.616 కిలో మీటర్లకు గాను 9.37 కిలో మీటర్ల మేర కాంక్రీటు, లైనింగ్ పనులు చేపట్టారు. ఇంకా ఎడమ కాలువకు సంబంధించి 8, కుడి కాలువకు సంబంధించి 11 బ్రాంచిలు, 267 ఆక్విడెక్టులు, సూపర్ పాసెజ్‌లు, అండర్ టన్నెళ్లు, ఔట్‌లెట్లు, డ్రాపులు, ఓటీ స్లూయిజ్‌లు నిర్మించాల్సి ఉంది. ప్రారంభంలో లైనింగ్ పనులకే పరిమితమయ్యారు తప్ప ప్రధాన పనులపై దృష్టి సారించలేదు. అయితే చేసిన పనులకు వైసీపీ ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించడం లేదు. దీంతో గత మూడేళ్లుగా ఆధునికీకరణకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. కాగా గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ పరిస్థితి ఉండేది కాదు. తోటపల్లికి ప్రత్యేక గుర్తింపుతో పాటు నిధులు మంజూరులో జాప్యం ఉండేది కాదు. అయితే ప్రస్తుత వైసీపీ తీరుతో తోటపల్లి పాత రెగ్యు లేటర్‌కు చెందిన రెండు కాలువలకు సంబంధించి ఆధునికీకరణ పూర్తికాని పరిస్థితి నెలకొంది. మొత్తంగా ఎడమ, కుడి కాలువల పరిధిలో సుమారు లక్ష ఎకరాలకు పైగా సాగునీటి ఇబ్బందులు తప్పేలా లేవు. గతేడాది ఖరీఫ్ సమయంలో అధికంగా కాలువలకు గండ్లు పడడంతో శివారు ప్రాంత భూములకు పూర్తిస్థాయిలో సాగునీరందలేదు.

బిల్లులు పెట్టినా మంజూరు లేదు

పాత రెగ్యులేటర్ పరిధిలో నిర్వహించిన పనులకు సంబంధించి జల వనరులశాఖ అధికారులు బిల్లులు పెట్టినా పైసా కూడా మంజూరు కాని పరిస్థితి ఏర్పడింది. కాంట్రాక్టర్లకు సుమారు రూ. 18 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉంది. అయితే ఈ ఆర్థిక సంవత్సరంలో బిల్లులకు మోక్షం లభించలేదు. మూడు నెలలకు పైగా నివేదించినా స్పందన లేదు. మరోవైపు ప్రాజెక్టు పరిధిలోని పాత రెగ్యులేటర్ పరిధిలోని పనుల నిర్వహణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్న ఆశతో యంత్రాంగం ఉన్నారు. అయితే వీరి ఆశలపై కూడా ఆర్థికశాఖ నీళ్లు చల్లింది. కొన్నాళ్లుగా సంబంధిత కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేయాల్సి ఉందని, పలు దఫాలు సమస్యలను వారు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం శూన్యం. మొత్తంగా నిధుల కోసం అధికారులు నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు రెండు కాలువల పరిధిలోని రైతులకు వారు సమాధానం చెప్పుకోలేకపోతున్నారు.



అధ్వానంగా కుడి కాలువ

ముగియనున్న గడువు

వాస్తవంగా 2018లో ఆధునికీకరణ పనులు ప్రారంభమయ్యాయి. అయితే 18 నెలల్లో వాటిని పూర్తి చేయలేకపోయారు. ఈ నేపథ్యంలో రెండోసారి గతేడాది మే నెల వరకు సమయం ఇచ్చారు. ఆ తర్వాత ఈ ఏడాది మే నెలాఖరుకు గడువు విధించారు. ఈ లోగా ఆధునికీకరణ పూర్తి చేయాల్సి ఉంది. అయితే ప్రతిసారీ పనుల నిర్వహణకు సమయం పొడిగిస్తున్నారు తప్ప నిధులు మాత్రం విడుదల చేయడం లేదు. దీనిపై కాంట్రాక్టర్లు మండిపడుతున్నారు. అప్పులు చేసి పనులు చేపట్టామని.. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో వడ్డీలు కట్టలేకపో తున్నామని వాపోతున్నారు. బిల్లులు చెల్లిస్తే పనులు నిర్వహణకు తాము సిద్ధమేనని వెల్లడిస్తున్నారు. కాగా మూడో దఫా గడువుకు మరో నెల రోజులే సమయం ఉంది. అయితే ఆ లోపుగా పనులు పూర్తయ్యేలా కనిపించడం లేదు.



ఎడమ ప్రధాన కాలువ ప్రారంభంలో పరిస్థితి ఇదీ..

ఖరీఫ్‌కు మరో రెండు నెలలే సమయం

ఖరీఫ్‌కు సంబంధించి సాగునీరు విడుదలకు మరో రెండు నెలల సమయమే ఉంది. ఈలోపుగా పనులు పూర్తవడం కష్టం. దీంతో ఈ ఏడాదిలో ఖరీఫ్ రైతులకు ఇబ్బందులు తప్పేటట్లుగా లేవు. అధికంగా రెండు కాలువల పరిధిలోని కాలువలు, ఆక్విడెక్టులతో పాటు పలు రకాల పనులు అస్తవ్యస్తంగా దర్శనమిస్తున్నాయి. తోటపల్లి నుంచి పాలకొండ శివారు ప్రాంతం, గరుగుబిల్లితో పాటు విజయనగరం జిల్లా పరిధిలోని వంగర, బలిజిపేట మండలాల్లోని పలు గ్రామాల రైతులకు సాగునీటి కష్టాలు తప్పేలా లేవు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంత అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

నోటీసులు జారీ చేశాం

తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని పాత రెగ్యులేటర్‌కు చెందిన ఎడమ, కుడి కాలువల ఆధునికీకరణ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేశాం. పనుల పూర్తికి మరో నెల రోజుల సమయమే ఉంది. కాంట్రాక్టర్ల బిల్లుల బకాయిలపై ఉన్నతాధికారులపై ఒత్తిడి తెస్తున్నాం. సుమారు రూ. 18 కోట్లు చెల్లించాల్సి ఉంది. పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకొస్తే చెల్లింపులకు చర్యలు చేపడతాం. ఈ ఏడాది ఖరీఫ్‌కు రైతులకు ఇబ్బందులకు గురిచేసే పరిస్థితులు లేవు. ప్రాజెక్టులో నిల్వ ఉన్న మేరకు సాగునీరు సరఫరా చేస్తాం.

-డి.రవికుమార్, డీఈఈ,
తోటపల్లి పాత రెగ్యులేటర్ విభాగం,
పాలకొండ

వలస ఓటర్లకు గాలం

- జాబితాలను రూపొందించే పనిలో అభ్యర్థులు
- స్వగ్రామాలకు రావాలని ఆహ్వానం

కొమరాడ, ఏప్రిల్ 6 : ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు గెలుపు కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఇందులో భాగంగా కీలకమైన వలస ఓటర్లపైన ఇప్పటి నుంచే దృష్టి సారించారు. ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల్లో ఉన్న వారిని ప్రసన్నం చేసుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. ముందస్తుగా పంచాయతీల వారీగా జాబితాలు రూపొందిస్తున్నారు. ఎక్కువ మంది ఉన్న చోటకు అభ్యర్థుల తరఫున వారి ముఖ్య నేతలు ఫోన్లు చేసి ఓటింగ్‌కు స్వగ్రామాలకు రావాలని ఇప్పటి నుంచే ఆహ్వానిస్తున్నారు. ఎన్నికల నాటికి సొంత గ్రామాలకు రప్పించే బాధ్యతను ఆయా పంచాయతీల ముఖ్య నాయకులకు అప్పగిస్తున్నారు.

ప్రతి నియోజకవర్గంలో..

జిల్లాలో కురుపాం, పార్వతీపురం, సాలూరు, పాలకొండ నియోజకవర్గాలకు చెందిన ఎంతోమంది ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో వలస జీవులుగా ఉన్నారు. కూలీలుగా, భవన నిర్మాణ కార్మికులుగా జీవనం సాగిస్తున్నారు. మరికొందరు ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారు. వీరితో పాటు చదువులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉన్నవారు వేలల్లో ఉన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఈ తరహా ఓట్లు సుమారు 10 వేల వరకు అంచనా. దీంతో ఎన్నికల షెడ్యూల్ రావడానికి ముందుగా వలంటీర్ల ద్వారా ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను వైసీపీ నాయకులు గుర్తించినట్లు సమాచారం. వారిని స్వగ్రామాలకు రప్పించి తమకు అనుకూలంగా ఓటు వేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. వలస ఓటర్లు ఎవరి గాలానికి చిక్కుతారో చూడాలి మరి.

తనిఖీలు ముమ్మరం చేయాలి: కలెక్టర్

పార్వతీపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు ముమ్మరం చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగు నియోజకవర్గాల్లో 48 ఫ్లయింగ్ స్క్వాడ్ , 36 స్టాటిక్ సర్వేలియన్స్ , 16 వీడియో సర్వేలియన్స్ , నాలుగు వీడియో వ్యూయింగ్ బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా బృందాల పనితీరును కమాండ్ కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. ఎన్నికల ప్రలోభానికి సంబం ధించి ఎటువంటి రవాణా జరుగుతున్నా.. కార్యకలాపాలు సాగుతున్నా నిర్ణీత సమయంలో తనిఖీలు చేపట్టాలన్నారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద విధిగా వెబ్‌కాస్టింగ్ చేయాలని ఆదేశించారు. మద్యం, గంజాయి, ఇతర సామగ్రి రవాణాను అరికట్టాలన్నారు. 1950 టోల్ ఫ్రీ నెంబర్‌తో సహా సి-విజిల్, ఆన్‌లైన్ విభాగంలో ప్రజలు ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. ఈ సమావేశంలో ఎస్పీ విక్రాంత్‌పాటిల్, పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏ పీవోలు విష్ణుచరణ్, కల్పనాకుమారి, జేసీ శోభిక, ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

కోడ్ ఉల్లంఘనులపై చర్యలు

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా

కోడ్ ఉల్లంఘనులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్‌మీనా ఆదేశించారు. శనివారం జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గంజాయి, మద్యం, నగదు, ఇతర సామగ్రి అక్రమ రవాణాపై పటిష్టమైన నిఘా ఉంచాలని ఆయన ఆదే శించారు. జిల్లాల సరిహద్దుల్లో ఉండే చెక్‌పోస్టులో నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. నగదు జప్తు కేసులను 24 గంటల్లోనే పరిష్కరించాలని తెలిపారు. తమ కార్యాలయం నుంచి పంపించే ఫిర్యాదులపై జిల్లా స్థాయిలోనే సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకున్న తర్వాత నివేదిక పంపాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జేసీ శోభిక, సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏ పీవోలు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించొద్దు: డీఎస్పీ

గరుగుబిల్లి, ఏప్రిల్ 6 : ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళిని అనుసరించి వ్యవహరించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు తెలిపారు. శనివారం ఉద్దవోలు, చిన గుడబ, వల్లరిగుడబ, పెదగుడబ, సన్యాసిరాజుపేట, రాయిందొరవలస, గరుగుబిల్లి, హిక్కింవలస, బీవీ పురం, శివ్వాం, కొత్తూరు, రావుపల్లి, కొత్తపల్లి, తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని ఆయన తెలిపారు. ఘర్షణలకు తావులేకుండా ఉండేలా ముందస్తు బైండోవర్‌కు చర్యలు చేపడుతున్నామన్నారు. మద్యం, నగదుతో పాటు ఇతర సామగ్రిని నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐ వై.అమ్మన్నరావు, సిబ్బంది ఉన్నారు.



ఉద్దవోలులోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

వడదెబ్బకు గురికావొద్దు

- డీఎంవో జగన్మోహన్‌రావు

కొమరాడ, ఏప్రిల్ 6 : ఎండల తీవ్రత దృష్ట్యా ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని , వడదెబ్బకు గురికా వొద్దని డీఎంవో జగన్మోహన్‌రావు సూచించారు. శనివారం పరుశురాంపురంలో ఉపాధి హామీ వేతనదారులతో మాట్లాడారు. వేసవి దృష్ట్యా వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్న కారణంగా శరీరం ఎక్కువగా నీరు, లవణాలను కోల్పోతుందని, వాటిని ఎప్పటికప్పుడు భర్తీ చేయాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన తెలిపారు. నీరు, నిమ్మరసం, మజ్జిగ, ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్లు, ఇంకా ఇంటి వద్ద అందు బాటులో ఉన్న ద్రావణాలు తాగాలని సూచించారు. వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు తప్పనిసరిగా ద్రవరూపంలో ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని, తాగునీరు వెంట తీసుకెళ్లాలని సూచించారు. వడ దెబ్బకు గురయ్యే సమయంలో తలనొప్పి, తల తిరగడం, వికారం, జ్వరం, స్పృహ కోల్పోవడం, అపస్మారక స్థితి, తదితర లక్షణాలు ఉంటాయని వివరించారు. ప్రాథమికంగా వెంటనే చేపట్టాల్సిన చర్యలను ఒక డెమో రూపంలో చేయించి అందరికీ అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు. పిల్లలకు తరచుగా నీరు తాగించాలన్నారు. ఎవరికైనా జ్వరం అనిపిస్తే వెంటనే వైద్య సిబ్బందికి వైద్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరగనున్న నేపథ్యంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ప్రజలకు ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించారు. కార్యక్రమంలో ఏఎంవో సూర్యనారాయణ, పీహెచ్ఎన్ విజయకుమారి, వైద్య , ఉపాధి ఫీల్డ్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

గుడ్డు ఏదీ?

- ప్రభుత్వ పాఠశాలలకు నిలిచిన సరఫరా
- బిల్లులు చెల్లించని వైసీపీ సర్కారు



పార్వతీపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు కోడిగుడ్ల సరఫరా నిలిచిపోయింది. నాలుగు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు వాటి సరఫరాను నిలిపేశారు. దీంతో విద్యార్థులు గుడ్లకు దూరమయ్యారు. పౌష్టికాహారంలో ఎంతో కీలకమైన గుడ్ల సరఫరాకు సంబంధించి సర్కారు బిల్లులు చెల్లించకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిప డుతున్నారు. జిల్లాలో ప్రైమరీ పాఠశాలలు 1,296, అప్పర్ ప్రైమరీ పాఠశాలలు 102, హైస్కూల్స్ 187 వరకూ ఉన్నాయి. వాటి పరిధిలో 94,002 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారందరికీ వారానికి ఐదు రోజుల పాటు మధ్యాహ్న భోజనంలో ఉడికించిన కోడిగుడ్డు పెట్టాల్సి ఉంది. అయితే ఈనెల ఒకటో తేదీ నుంచి కొన్ని పాఠశాలలకు వాటి సరఫరా నిలిచిపోయింది. దీంతో విద్యార్థులకు గుడ్డును అందిం చడం లేదు. ఇంకొన్నిచోట్ల గుడ్లు నిల్వ ఉన్న మేరకు అందిస్తున్నారు. అయితే అవి కూడా పూర్తిస్థాయిలో విద్యార్థులకు సరిపోకపోతే మధ్యాహ్న భోజనంలో పెట్టడం లేదు. ఒకరికి ఇచ్చి.. ఇంకొరికి ఇవ్వకపోతే ఉపాధ్యాయులు ఇబ్బందకర పరిస్థితులు ఎదుర్కొనే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయిలో పిల్లలకు సరిపడే గుడ్లు నిల్వ ఉంటేనే ఉడకబెట్టి అందిస్తున్నారు.

అప్‌లోడ్ చేసి నాలుగు నెలలైనా..

ప్రతి పాఠశాలలకు వారానికి ఒకసారి కాంట్రాక్టర్లు గుడ్లు సరఫరా చేస్తుంటారు. వాటికి సంబంధించి డీఈవో కార్యాలయంలో బిల్లులు అందిస్తారు. మధ్యాహ్న భోజనం పథకం బిల్లులు మంజూరు చేసే గ్రీన్ చానల్ ద్వారా వాటిని అప్‌లోడ్ చేస్తే 30 రోజుల నుంచి 60 రోజుల లోపు కాంట్రాక్టర్లకు నగదు జమవుతుంది. కాగా విద్యాశాఖ కార్యాలయం నుంచి బిల్లులు అప్‌లోడ్ చేసి నాలుగు నెలలు గడుస్తున్నా.. ఇప్పటికీ నగదు మంజూరు కాకపోవ డంతో కాంట్రాక్టర్లు రాష్ట్ర వ్యాప్తంగా గుడ్ల సరఫరాను నిలిపేశారు. ఇందులో భాగంగానే జిల్లాకు కూడా గుడ్ల సరఫరా నిలిచింది. మొత్తంగా రూ.15 కోట్ల మేర సర్కారు చెల్లించాల్సి ఉంది. అయితే ఈ బిల్లులు ఎప్పుడు మంజూరవుతాయి.. ఇంకెప్పుడు గుడ్ల సరఫరా చేస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

రేపోమాపో చక్కీలు కూడా ...

పాఠశాల విద్యార్థులకు సరఫరా చేసే బెల్లం చక్కీలకు కూడా కాంట్రాక్టర్లకు బిల్లులు అందలేదని సమాచారం. ఈ నేపథ్యంలో రేపోమాపో వాటి సరఫరా కూడా నిలిచిపోయే పరిస్థితి ఉంది. బిల్లలను చెల్లించిన తర్వాతే తిరిగి చక్కీలు సరఫరా చేయనున్నట్లు సమాచారం. ఏదేమైనా పాఠశాల విద్యార్థుల పౌష్టికాహారంలో కీలకమైన గుడ్లతో పాటు బెల్లం చక్కీలకు సంబంధించి ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయింది

రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలకు గుడ్ల సరఫరా నిలిచిపోయింది. జిల్లాలో గుడ్లు నిల్వల ఉన్నంతవరకు వివిధ పాఠశాలలకు అందిస్తాం. త్వరలోనే సరఫరా పునఃప్రారంభమవుతుంది.

- పగడాలమ్మ, డీఈవో, పార్వతీపురం మన్యం

ఎస్ఏ-2 పరీక్షలు ప్రారంభం

గరుగుబిల్లి, ఏప్రిల్ 6 : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఏ-2 పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. 1 నుంచి 5 తరగతుల వారికి ఈ నెల 16వ తేదీ వరకు, 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు ఈ నెల 19వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. తొలిరోజు 1 నుంచి 8వ తరగతులకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, 9వ తరగతి వారికి మధ్యాహ్నం 12.15 గంటల వరకు తెలుగు పరీక్ష నిర్వహించారు. 9వ తరగతికి సంబంధించి ప్రశ్నపత్రాలను అందించారు. 1 నుంచి 8వ తరగతి వారికి ఓఎంఆర్ షీట్లు అందించారు. ఈ సారి సీబీఏ విధానంలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ప్రశ్నపత్రాలను ద్విభాష విధానంలో రూపొందించారు. ఇంగ్లిషు మీడియానికి సంబంధించిన వారికి ఆంగ్లంలో, తెలుగు మీడియం విద్యార్థులకు తెలుగులో ప్రశ్నపత్రాలను అందించారు. పరీక్షలు నిర్వహణ పూర్తయిన అనంతరం ఓఎంఆర్ షీట్లు, ప్రశ్నపత్రాలను సేకరించి కన్సలిడేషన్ జాబితా తయారు చేసి స్కానింగ్ నిమిత్తం ఈ నెల 20న జిల్లా కేంద్రానికి అందించాల్సి ఉందని ఎంఈవో ఎన్. నాగభూషణరావు తెలిపారు. కాగా ఏ రోజుకారోజు ప్రశ్నపత్రాలను సంబంధిత ఎమ్మార్సీ కేంద్రాల నుంచి పరీక్షకు ఒక గంట ముందు తీసుకెళ్లాలన్నారు. ఆయా తరగతుల వారికి ఇంగ్లిషు, గణితం, సైన్స్, సోషల్, ఓఎస్ఎస్‌సీ, స్లాష్-2024 గ్రేడ్-4, కాంపోజిటివ్ పరీక్షలను నిర్వహించనున్నారు.

శిక్షణ తరగతులకు ఎలా వెళ్లాలి?

ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 19 వరకు ఎస్ఏ-2 పరీక్షలు జరగనున్న సంగతి తెలిసిందే. అయితే పలువురు ఉపాధ్యాయులకు ఈ నెల 15న కురుపాం నియోజకవర్గంలో నిర్వహించనున్న ఎన్నికల శిక్షణకు హాజరవ్వాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. 15న ఓఎస్ఎస్‌సీ పరీక్షతో పాటు జనరల్ సైన్స్, ఫిజికల్ సైన్స్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. ఈ పరీక్షల సమయంలో ఎటు వెళ్లాలో తెలియక ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఎంఈవో నాగభూషణరావును వివరణ కోరగా ఈ సమస్యను జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. వేరే సిబ్బందిని నియమించేందుకు అనుమతులు కోరుతామన్నారు.



రావుపల్లిలో ఎస్ఏ-2 పరీక్షల తీరును పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు, సీఆర్‌పీ

భవిష్యత్తుకు గ్యారెంటీపై ప్రచారం

తెర్లాం: మండలంలో భవిష్యత్తుకు గ్యారెంటీపై జోరుగా ప్రచారం చేస్తున్నారు. శనివారం తెర్లాం, అమిటి, జన్నివలస, కొరటాం, కుమ్మరిపేట సూపర్ సిక్స్ పథకాలపై స్థానిక టీడీపీ నాయకులు అవగాహన కల్పించారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీని ఓడించాలని, చంద్రబాబు సీఎం కాకపోతే రాష్ట్రం అధోగతి పాలవుతుందన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం వెనక్కి వెళ్లిపోయిందని, ఇప్పటికైనా మేల్కొనకపోతే మరింత నష్టం తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నర్సుపల్లి వెంకటనాయుడు, రాష్ట్ర వాణిజ్య విభాగాల కార్యనిర్వాహక కార్యదర్శి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ సింహాచలం, కరణం రమేష్, ఎంపీటీసీ ఆనంద్, ముచ్చు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

బారికేడ్ల వితరణ

లక్కవరపుకోట (కొత్తవలస): మండలంలోని కంటకాపల్లి వద్దనున్న శారదా మెటల్స్ కంపెనీ ట్రాఫిక్ నివారణకు అవసరమైన బారికేడ్లను వితరణ చేసింది. రోడ్డు ట్రాఫిక్, యాక్సిడెంట్లు నివారణకు 20 ఇనుప బారికేడ్లను శనివారం కొత్తవలస సీఐ చంద్రశేఖర్‌కు అందజేశారు. కంపెనీ తమ సామాజిక బాధ్యతగా ట్రాఫిక్ సామగ్రి ఇచ్చినందుకు సీఐ కృతజ్ఞతలు తెలిపారు. కంపెనీ యాజమాన్యం తరఫున హెచ్ఆర్ డీజీఎం.సన్యాసిరావు, అసిస్టెంట్ మేనేజర్ శంకరరావు, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

తెర్లాం: మండలంలో ఉద్దవోలు గ్రామానికి చెందిన సచివాలయ ఉద్యోగి ఉప్పాడ శ్రీకాంత్ ఇటీవల గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందే. ఆ కుటుంబానికి ఎంపీడీవో మధుసూదనరావు, మండల కార్యదర్శులంతా కలసి రూ. 1,01,500లను ఆర్థిక సాయంగా అందించారు. మండలంలో ఉన్న సచివాలయ ఉద్యోగులంతా ఆ కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీకాంత్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

20 నిమిషాలు నిలిచిన రైళ్లు

బొబ్బిలి: బొబ్బిలి రైల్వే స్టేషన్ సమీపంలో అవుటర్ దగ్గర ఇంటర్ సిటీ రైలుతో పాటు విజయవాడ-రాయగడ రైలు, గూడ్స్ రైళ్లు శనివారం కొద్ది సేపు నిలిచిపోయాయి. సిగ్నల్ లేకపోవడంతో సుమారు 20 నిమిషాల పాటు రైళ్లను నిలిపేయడంతో విపరీతమైన ఉక్కబోతతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

శిక్షణ శిబిరాన్ని విజయవంతం చేయాలి

విజయనగరం దాసన్నపేట: జిల్లా కేంద్రంలోని కణపాక యూత్ హాస్టల్‌లో ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ జంతు హింస, రవాణా, గోవధ నిషేధ చట్టాలపై శిక్షణ శిబిరం నిర్వహిస్తామని గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ అన్నారు. శనివారం చిన్న పల్లివీధిలోని సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అక్రమ సంతలు, పశువుల అక్రమ రవాణా జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు చట్టాలపై కొంతమందికి శిక్షణ ఇవ్వడానికి ఈ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. జంతవుల పరిరక్షణ మనందరి బాధ్యతగా తీసుకోవాలని, అందరూ ముందుకు రావాలన్నారు. ఈ సమావేశంలో సమాఖ్య ప్రతినిధులు రాజకుమారి, సత్యవతి, పవన్ కు మార్, విజయ కుమార్, రామారావు పాల్గొన్నారు.

సాయికృష్ణ కల్యాణ మండపంలో కోర్టు విధులు

శృంగవరపుకోట: స్థానిక శ్రీసాయికృష్ణ కల్యాణ మండపంలో స్థానిక కోర్టు విధుల నిర్వహణకు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కల్యాణ చక్రవర్తి తెలిపినట్టు న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు జీ.ఎస్.దేముడు వెల్లడించారు. నూతనంగా ఎన్నికైన ఆయన శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తిని సభ్యులతో కలిశారు. ఈ మేరకు సంబంధిత ఉత్తర్వుల కాపీని తనకు అందించినట్టు చెప్పారు. ఆయన వెంట కార్యదర్శి బి.సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి ఎల్.అప్పారావు, కోశాధికారి త్రిమూర్తులు, మీడియా సెక్రటరీ డబ్ల్యూఎస్‌శర్మ, మాజీ అధ్యక్షుడు అల్లు సత్యాజీ, న్యాయవాదులు గేదల ప్రకాష్ తదితరులు ఉన్నారు.

టీడీపీలోనే బీసీలకు పెద్దపీట

బాడంగి: తెలుగుదేశం ప్రభుత్వం ఆవిర్భావం నుంచి బీసీలకు పెద్దపీట వేస్తోందని విజయనగరం పార్లమెంట్ బీసీ సాధికారిత కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు అన్నారు. శనివారం భీమవరం గ్రామంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే బీసీలకు అన్ని విధాలుగా ఆదుకుంటారన్నారు. టీడీపీ అభ్యర్థి బేబీనాయనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తెంటు రవిబాబు, మాజీ ఎంపీపీ బొంతు త్రినాథనాయుడు, పార్టీ కార్యదర్శి లచ్చుపతుల సత్యం, వైస్ ఎంపీపీ సింగిరెడ్డి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వస్త్రపురి కాలనీలో పారిశుధ్య లోపం



టీచర్స్ కాలనీలో నిల్వ ఉన్న మురుగు

రాజాం: పురపాలక సంఘ పరిధిలోని వస్త్రపురి కాలనీని పారిశుధ్య లోపం వేధిస్తోంది. కాలనీల మధ్య లోని మురుగు కుంటల్లో నీరు నిల్వ ఉండటంతో ఈగలు, దోమలకు నిలయంగా మారింది. దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంలో అధికారులు చర్యలు తీసుకుని మురికి కుంటలను పూడ్చేలా చూడాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

కోటమ్మ హుండీ ఆదాయం రూ.3 లక్షలు



శృంగవరపుకోట రూరల్: మండలంలో మూడు రోజుల పాటు జరిగిన కొట్టాం కోటమ్మ హుండీ ఆదాయాన్ని ఈవో నాగేంద్ర ఆధ్వర్యంలో శనివారం లెక్కించారు. అమ్మవారి మూడు రోజుల హుండీ ఆదాయం రూ.మూడు లక్షల 36వేల 229 లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ట్రస్ట్ బోర్డు చైర్మన్ రమణబాబు పాల్గొన్నారు.

బేబీ కిట్లు.. మరి లేనట్టేనా?

- టీడీపీ హయాంలో పిల్లల సంరక్షణ కోసం పంపిణీ
- వైసీపీ ప్రభుత్వంలో నిలిచిన సరఫరా

భోగాపురం: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు ఉపయోగపడేలా అమలు చేసిన ఎన్నో సంక్షేమ పథకాలు వైసీపీ వచ్చాక కనుమరుగయ్యాయి. సంక్షేమ ప్రభుత్వం అని చెప్పుకుంటున్నప్పటికీ జగన్ అధికారంలోకి వచ్చాక అరకొర నగదు పంపిణీ మినహా అసలైన సంక్షేమాలు, సౌకర్యాలు ఏపీ ప్రజలకు అందడం లేదు. దీనికి ఒక సజీవ ఉదాహరణ బేబీ కిట్ల పథకం.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం జరిగితే శిశువుకు రక్షణగా కొన్ని వస్తువులను బేబీ కిట్ పేరుతో గత టీడీపీ ప్రభుత్వం అందించేది. నవజాతి శిశువులకు అవసరమైన వస్తువులను కొనుగోలు చేయాలంటే పేద, మధ్య తరగతి కుటుంబాలపై కొంత ఆర్థిక భారం పడుతుంది. అందుకోసం ప్రసవం తరువాత ఇన్‌ఫెక్షన్లు సోకకుండా శిశువులను సంరక్షించాలనే మంచి ఉద్దేశంతో 2016లో టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ బేబీకిట్లు పథకాన్ని ప్రారంభించింది. శిశువు నిద్రించడానికి చిన్న పరుపు, చేతులు శుభ్రం చేసుకునే ద్రావణం, బేబీ సబ్బు, బేబీ పౌడర్, దోమతెర గొడుగు, నాప్‌కిన్లు తదితర వస్తువులను కిట్ల రూపంలో బాలింతలకు అందజేసేవారు. దీంతో బాలింతలు ఆసుపత్రి నుంచి బయటికి వస్తుండగానే చిన్న పరుపును రక్షణగా ఉపయోగించి బయటకి వచ్చేవారు.

అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పథకాన్ని 'డాక్టర్ వైఎస్సార్ బేబీకిట్లు' గా పేరు మార్చి అదే పథకాన్ని అమలు చేస్తూ కొన్ని నెలలు బాలింతలకు బేబీకిట్లు అందజేశారు. ముచ్చటగా కొన్ని నెలల తరువాత ఈ పంపిణీ నిలుపుదల చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో బాలింతలకు అందజేసే బేబీకిట్లు సుమారుగా గత నాలుగేళ్లనుంచి అందించడం లేదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో బాలింతలు, వారి కుటుంబ సభ్యులు ఆసుపత్రి సిబ్బందిని బేబీ కిట్లపై ప్రశ్నించగా ఏప్పటి నుంచో సరఫరా నిలిచిపోయిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నగదు మాత్రం అందజేస్తున్నారని సమాధానం ఇస్తున్నట్లు బాలింతలు చెబుతున్నారు.



జిల్లాలో 48 పీహెచ్‌సీలు, 4 సీహెచ్‌సీలు, 4 ఏరియా ఆసుపత్రులు ఉన్నాయి. ఈ ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిరంతరం ప్రతి నెలా వందలాది ప్రసవాలు జరుగుతుండగా వందలాది శిశువులు జన్మిస్తున్నారు. అయితే బాలింతలకు ఆసుపత్రుల్లో అందిస్తున్న పరిహారం చాలా వరకు అక్కడే ఖర్చ యిపోతున్నట్లు బాలింతలు, వారి కుటుంబ సభ్యులు వాపోతున్నారు. అందుకే మళ్లీ బేబీకిట్లను అందిస్తే బాగుంటుందని బాలింతలు వాపోతున్నారు.

నగదు జమ చేస్తున్నాం

ప్రస్తుతం బేబీకిట్లు ఏమీ అందించడంలేదు. శిశువుల న్యూట్రిషన్ ఆహారం, సంరక్షణ నిమిత్తం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.5, రూ.6 వేలు చొప్పున బాలింతల ఖాతాలకు నగదు జమచేస్తోంది.

-భాస్కరరావు, డీఎంహెచ్‌వో

మహిళలకు జగన్ నమ్మక ద్రోహం



పార్టీ కండువాలు వేస్తున్న కోండ్రు

రాజాం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళలకు నమ్మక ద్రోహం చేశారని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీ మోహన్ అన్నారు. శనివారం శ్యాంపురం టీడీపీ క్యాంపు కార్యాలయంలో రేగిడి మండలం ఆమదాలవలస పంచాయతీకి చెందిన 150 వైసీపీ కుటుంబాలు, రాజాం మండలం బొద్దాం గ్రామానికి చెందిన 15 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరిని సాదరంగా ఆహ్వానించి.. టీడీపీ కండువాలు వేశారు. ఆమదాలవలస పంచాయతీకి చెందిన తెలుగుదేశం నేత సౌరౌతు వెంకటరమణ అధ్యక్షతన వైసీపీకి చెందిన సౌరోతు ఉత్తరమ్మ అప్పలనాయుడు, రుంక రమణమ్మ, సీమల గౌరమ్మ, నారాయణరావు, గేదెల ప్రవీణ్ తదితరులు, బొద్దాం గ్రామానికి చెందిన సందీప్ కుమార్, శంకర్, కనకరాజు, రాంబాబు, శ్రీను, అప్పలరాజు తదితరులు ఉన్నారు.

రేగిడి: వైసీపీ పాలనలో బీసీలు తీవ్ర అణచివేతకు గురియ్యారని కోండ్రు మురళీమోహన్ ఆరోపించారు. మండలంలో తాటిపాడు గ్రామంలో శనివారం జయహో బీసీ ర్యాలీ, ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల టీడీపీ నేతలు దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌బాబు, మజ్జి శ్రీనివాసరావు, గురవాన రమేష్, పాలూరి రామినాయుడు, పాలవలస రామచంద్రినాయుడు, రాజాం టీడీపీ నేత గురవాన నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా చేరికలు



టీడీపీలో చేరిన వారితో బేబీనాయన, మండల నేతలు

బొబ్బిలి: రామభద్రపురం మండలం కొండపాలవలస గ్రామానికి చెందిన 60 కుటుంబాల వారు శనివారం బొబ్బిలి కోటకు వచ్చి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీకి చెందిన ఉపసర్పంచ్ లంక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారంతా పార్టీలో చేరడంతో కండువాలు వేసి బేబీనాయన ఆహ్వానించారు. జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు మడక తిరుపతినాయుడు, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కర్రోతు తిరుపతిరావు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో లంక నాగభూషణ్, బొత్స సత్యం, వార్డు సభ్యుడు దువ్వల అప్పలస్వామి, మామిడి వెంకటరమణ తదితరులు ఉన్నారు.

- బొబ్బిలి తెలుగుదేశం-జనసేన-బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన శనివారం ఐటీఐ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో బేబీనాయన వెంట వార్డు ఇన్‌చార్జి బొద్దాన అప్పారావు, తెలుగు యువత కార్యదర్శి కాగాన సునీల్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు, నేతలు రౌతు రామ్మూర్తి, పువ్వల శ్రీనివాసరావు, గెంబలి శ్రీనివాసరావు, సుంకరి సాయిరమేష్, సజ్జా వెంకటరావు, గిరడ అప్పలస్వామి, పాలూరు బాబు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

లక్కవరపుకోట (కొత్తవలస), ఏప్రిల్ 6: మండల కేంద్రమైన కొత్తవలసలో శనివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షునిగా నూతనంగా ఎన్నికైన ఎం.త్రినాథరావు పార్టీ నేతలతో కలిసి పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశప్రజల అభ్యున్నతికి, అభివృద్ధికి బీజేపీ పనిచేస్తుందని అన్నారు. ● **శృంగవరపుకోట:** శృంగవరపుకోట పట్టణంలో శనివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి, నియోజక వర్గ ఇన్‌చార్జి శ్రీరంగ దానేష్‌పార్టీ జెండా ఆవిష్కరించారు. మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.ఆర్.వి. రూపేష్, ఎలమంచిలి ప్రసాద్, దాశరథి, బొండపల్లి చంద్రశేఖర్ తదితరులున్నారు. ● **విజయనగరం రూరల్:** బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం ఘ నంగా నిర్వహించారు. పార్టీ జెండాను పార్లమెంటు కన్వీనరు శంబర లక్ష్మీనర సింహం, జాతీయ కౌన్సిల్ సభ్యుడు భవిరెడ్డి శివప్రసాద్‌రెడ్డి ఆవిష్కరించారు. బీజేపీ నాయకులు ఇ.సుధీర్, బూర్లె శ్రీధర్, పి.అశోక్, గండికోట శాంతి, ఇప్పిలి గోపాలకృష్ణ, కంది సీతారాం తదితరులు పాల్గొన్నారు. ● **జామి:** మండల కేంద్రమైన జామిలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షురాలు ఆదిలక్ష్మి పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ ప్రతినిధులు దినేష్, యలమంచిలి ప్రసా ద్, సీహెచ్ జగదీశ్వరి, సీహెచ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పనిచేసే నేతలను ఎన్నుకోండి

- టీడీపీ సీనియర్ నాయకుడు అశోక్‌గజపతిరాజు



మాట్లాడుతున్న అశోక్‌గజపతిరాజు

విజయనగరం రూరల్, ఏప్రిల్ 6: రాష్ట్రానికి, జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు వచ్చేలా ఓటర్లంతా వచ్చే ఎన్నికల్లో సహకరించాలని, పనిచేసే నేతలను ఎన్నుకోవాలని టీడీపీ సీనియర్ నేత అశోక్‌గజపతిరాజు సూచించారు. విజయనగరం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం పార్టీ కార్యాలయంలో శనివారం రాత్రి జరిగింది. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కలిశెట్టి అప్పలనాయుడుని పార్టీ శ్రేణులకు ఆయన పరిచయం చేశారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ, మంచి ప్రజాప్రతినిధులతై సమస్యలను చట్ట సభల్లో ప్రస్తావించి, పరిష్కరించే ప్రయత్నం చేస్తారన్నారు. అలా కాకుండా ఊడిగం చేసేవారిని చట్ట సభలకు ఎన్నుకుంటే, ప్రజా సమస్యలు, జిల్లా అభివృద్ధి అలాగే ఉండిపోతుందన్నారు. విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గానికి అదితి గజపతిరాజు, పార్లమెంటుకు కలిశెట్టి అప్పలనాయుడు ఎన్నికల బరిలో ఉన్నారని, వారిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, ఇందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రణాళికయుతంగా ప్రజల ముందుకు వెళ్లాలన్నారు. పార్లమెంటు అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ, పార్టీ కోసం అహర్నిశలూ శ్రమించానని, కష్టపడేవారికి టీడీపీలో గుర్తింపు ఉంటుంద నడానికి తనకు ఇచ్చిన ఎంపీ సీటే నిదర్శనమని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి దృష్ట్యా రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటేసి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్య ర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం అదితిగజపతిరాజు మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన నాయకురాలు పాలవలస యశస్విని, బీజేపీ నాయకుడు ఇమంది సుధీర్, టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, బొద్దల నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణులతో అదితి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఆదితి గజపతిరాజు

విజయనగరం రూరల్: విజయనగరం నియోజకవర్గ పరిధిలోని క్లస్టర్-5, 6 పరిధిలోని ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జిలతో టీడీపీ నేత అదితి గజపతిరాజు శనివారం పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త ఓటర్ల వివరాలు, ఓటరు వెరిఫికేషన్, కుటుంబ సారథులు, డబుల్ ఎంట్రీ ఓటర్లను గుర్తించి తక్షణమే పార్టీ కార్యాలయానికి అందించాలని కోరారు.

విజయం సాధించాల్సిందే



టీడీపీ తీర్థం పుచ్చుకున్న రామయ్యపాలెం గ్రామస్థులు

లక్కవరపుకోట: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో శృంగవరపుకోట నియోజకవర్గంలో వార్ వన్‌సైడ్ కావాలని టీడీపీ అభ్యర్థి కోళ్ల లలిత కుమారి పిలుపునిచ్చారు. శనివారం ఆమె నివాసంలో జామి మండలం రామయ్యపాలెం నుంచి సుమారు 30 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ సందర్భంగా వారంతా లలిత కుమారిని ఎమ్మెల్యేగా గెలిపించి... చంద్రబాబుకు నియోజకవర్గాన్ని కానుకగా పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పెదబాబు, రామయ్యపాలెం మాజీ సర్పంచ్ మారడబూడి చినదేముడు, వార్డు సభ్యులు రాము, బి.రాము, ఎస్.గణేష్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఎం.కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిలో నాణ్యమైన పనులు చేయాలి

రామభద్రపురం: ఉపాధి హామీ పథకంలో వేతనదారులు నాణ్యమైన పనులు చేయాలని అంబుడ్స్‌పర్సన్ శతపతి అన్నపూర్ణ సూచించారు. ముచ్చర్లవలస, రామభద్రపురం గ్రామాల్లో ఉపాధి పనులను ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొలతల ప్రకారం రెండుపూటలా పనిచేసి ప్రభుత్వం అందిస్తున్న రూ.300 వేతనం పొందాలన్నారు. మండలంలోని 22 పంచాయతీలలో దాతలు ఇచ్చిన మెడికల్ కిట్లను, వెయ్యి ఓఆర్ఎస్ ప్యాకెట్లను వేతనదారులకు పంపిణీ చేశారు. ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఏపీవో త్రినాథరావు, ఈసీ సత్యనారాయణ, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలి: మండలంలోని కోమటిపల్లి గ్రామంలో జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను అంబుడ్స్‌మన్ శతపతి అన్నపూర్ణ శనివారం పరిశీలించారు. పెంచిన వేతనాలపై వేతనదారులకు అవగాహన కల్పించారు. వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉన్నందున తాగునీరు, టెంట్లు, మందులు వంటి సౌకర్యాల కల్పనను ఆమె పరిశీలించారు. మస్తర్లను పరి శీలించారు. వేతనదారులకు ఎటువంటి నష్టం జరగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఎటువంటి అక్రమాలకు తావులేకుండా పనులు చేయించాలన్నారు. వేతనదారులంతా వడ దెబ్బ బారినపడకుండా స్వీయరక్షణ చర్యలు పాటించాలని అన్నపూర్ణ హితవు పలికారు. ఆమె ఏపీవో లక్ష్మీపతిరాజు, టెక్నికల్ అసిస్టెంట్ శంకరావు తదితరులు పాల్గొన్నారు.



కోమటిపల్లిలో పనులు పరిశీలిస్తున్న అంబుడ్స్‌మెన్ అన్నపూర్ణ

గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

రేగిడి, ఏప్రిల్ 6: సార్వత్రిక ఎన్నికల ప్రశాంత నిర్వహణకు స్థానిక పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నారు. శనివారం మండలంలో బూరాడ, అంబఖండి, సోమరాజుపేట గ్రామాల్లో రాజాం రూరల్ సీఐ శ్రీనివాసరావు, స్థానిక ఎస్ఐ శ్రీనివాస్, ఆర్పీఎస్ ఎఫ్ సిబ్బంది పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. ఈ ఫ్లాగ్‌మార్చ్‌లో స్థానిక పోలీస్‌సిబ్బంది ఉన్నారు. ● **విజయనగరం క్రైం:** జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్టు సీఐ వెంకటరావు తెలిపారు. శనివారం కేఎల్‌పురం, కణపాక, కామాక్షినగర్, అయ్యన్నపేట ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాల్లో అల్లర్లు సృష్టించే వారిని గుర్తించి, బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు తారకేశ్వర రావు, నరేష్, హరిబాబు నాయుడు, నవీన్ పడాల్, సిబ్బంది పాల్గొన్నారు.



విజయనగరం అయ్యన్నపేటలో..



బూరాడలో..

200 కేజీల గంజాయి స్వాధీనం

- ముగ్గురు నిందితులకు రిమాండ్



గంజాయి, నిందితులతో పోలీసులు

శృంగవరపుకోట, ఏప్రిల్ 6: కారులో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించి గంజాయిని స్వాధీనం చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి సీఐ మురళీరావు అందించిన వివ రాలు ఇలా ఉన్నాయి. శనివారం ఉదయం 7 గంటల సమయంలో స్థానిక పంది రప్పన్న కూడలి వద్ద ఎస్.ఐ సీహెచ్ గంగరాజు సిబ్బందితో కలసి వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అరకు నుంచి వస్తున్న బొలెరో వాహ నాన్ని ఆపి తనిఖీ చేస్తుండగా అందులో తరలిస్తున్న 200 కేజీల గంజాయి బయటపడింది. ఈ వాహనంలో రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన కైలాష్ చంద్రబలా య్, మహావీర్ కుమార్‌జాట్, శివలాల్ జూట్ అనే ముగ్గురు రవాణా చేస్తూ పట్టుబడ్డారు. పోలీసులు వీరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. నిందితులను రిమాండ్‌కు పంపించామని సీఐ తెలిపారు.

యువతి అనుమానాస్పద మృతి



పార్వతి(ఫైల్)

సాలూరు రూరల్: గత నెల ఐదో తేదీన అదృశ్యమైన ఓ యువతి శనివారం శవమై కనిపించింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. దండిగాం గ్రామానికి చెందిన చెడ్డ ఎర్రయ్య, పోలమ్మలకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె పేరు చెడ్డ పార్వతి అలియాస్ జ్యోతి(19). ఈమె పాచిపెంట మండలం సరాయివలస గ్రామంలో పదో తరగతి వరకు చదివింది. ఆ తర్వాత ఇంటి వద్దనే తల్లిదండ్రుల చెంత ఉంటోంది. ఖాళీగా ఉండకుండా ఏదో పని చేసుకోవచ్చు కదా.. అని తల్లిదండ్రులు అప్పుడప్పుడు సూచిస్తుండేవారు. ఎక్కడికైనా వెళ్లి ఏదో పని చేస్తానులే.. అని ఆమె అనేది. ఈనేపథ్యంలో గత నెల 5న నుంచి ఆమె కనిపించడం లేదు. బంధువులను ఆరా తీయగా, రాలేదని చెప్పారు. తమ కూతురు ఎక్కడికో వెళ్లి ఉంటుందని తల్లిదండ్రులు భావించారు. ఈక్రమంలో పోడుకు వెళ్లిన కొందరు.. తోటలో ఒక శవం ఉందని చెప్పుకోవడంతో వెళ్లి చూశారు. చెట్టుకు వేలాడుతున్న శవం చున్నీ చూసి తమ కూతురే అని నిర్ధారించుకుని, బోరున రోధించారు. ఆమె మరణించి ఎక్కువ రోజులు కావడంతో శవం ఛిద్రమైంది. పైగా కొద్దిరోజుల కిందట ఆ ప్రాంతంలో నిప్పుకు మంటలు రేగడంతో శవం కింద భాగం కొద్దిగా కాలిన ఛాయలు ఉన్నాయి. ఈ ఘటనా స్థలాన్ని సాలూరు సీఐ బాలకృష్ణ పరిశీలించారు. తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదు స్వీకరించి, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేయాలని ఆయన పోలీసులకు సూచించారు.

కారు, బైకు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

బొండపల్లి: కారు, బైకు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు సమీపంలో జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం గజపతినగరం నుంచి విజయనగరం వైపు వెళ్తున్న కారును ఎదురుగా విజయనగరం నుంచి గజపతినగరం వైపు వస్తున్న ద్విచక్రవాహనం వేగంగా వచ్చి అదుపుతప్పి ఢీకొంది. ఈ ఘటనలో బైకుపై ప్రయాణిస్తున్న గజపతినగరం మండలం లింగాలవలస గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన ఇద్దరిని 108 వాహనంలో విజయనగరంలోని కేంద్ర సర్వజన ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. పోలీసులు ప్రమాదంపై దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

రామభద్రపురం: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. దీనికి సంబంధించి ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొబ్బిలి మండలం మెట్టవలస గ్రామానికి చెందిన కాజా వేణుగోపాలస్వామి శుక్రవారం అర్ధరాత్రి బైక్‌పై రామభద్రపురం నుంచి స్వగ్రామమైన మెట్టవలస వెళ్తున్నాడు. గ్లోబల్ స్కూల్ వద్ద వచ్చేసరికి బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయాలవ్వడంతో విజయనగరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నాడని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బెల్లం ఊట ధ్వంసం

వంగర: వీవీఆర్‌పేటలో సారా తయారీ కోసం డ్రమ్ములతో సిద్ధంగా ఉంచిన 1400 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేసినట్లు రాజాం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తెలిపారు. గ్రామంలో నాటు సారా విచ్చలవిడిగా తయారు చేస్తున్నారన్న సమాచారంతో శనివారం దాడులు నిర్వహించామన్నారు. నాగావళి నదీ తీరంలో 7 డమ్ములతో ఉన్న బెల్లం ఊటను గుర్తించి పారబోసినట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో అవగాహన కల్పించారు. సిబ్బంది ఎస్ చంద్రశేఖర్, శ్రీనివాస్, హుస్సేన్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

లక్కవరపుకోట (కొత్తవలస): మండలంలోని ముసిరాం గ్రామంలో నాటు సారా తయారీకి అవసరమైన 400 లీటర్ల బెల్లంఊటను శనివారం ధ్వంసం చేసినట్లు కొత్తవలస సీఐ చంద్రశేఖర్ తెలిపారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తమ సిబ్బందితో కలిసి బెల్టు షాపులు, నాటుసారా కేంద్రాలపై విస్తృతమైన దాడులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముసిరాం, రామలింగపురం, దేవాడ, మన్నిపాలెం, అర్ధన్నపాలెం, గొల్లలపేట, ఎర్రవానిపాలెం గ్రామాలపై నిరంతరం నిఘా పెట్టామన్నారు.

రామభద్రపురం: మండల పరిధిలోని చందాపురం గ్రామ శివారులో శనివారం పోలీసులు జరిపిన దాడుల్లో వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు. సారా తయారు చేయడానికి సిద్ధంగా ఉంచిన ఈ ఊటను ధ్వంసం చేశామన్నారు. సారా తయారు చేసినా, అమ్మకాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

మద్యం సీసాలు స్వాధీనం

బొబ్బిలి: బొబ్బిలి ఎస్ఈబీ సర్కిల్ పరిధిలో బాడంగి మండలం గొల్లాది గ్రామానికి చెందిన ఆనందరావు మోటారు సైకిల్‌పై 104 మద్యం సీసాలు తరలిస్తుండగా శనివారం పట్టుబడినట్లు ఎస్ఈబీ సీఐ మురళీధర్ తెలిపారు. పట్టుబడ్డ మద్యం సీసాలను సీజ్ చేశామని, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో తన వెంట ఎస్ఐలు ఎస్‌పీ రామారావు, ఎల్.తిరుపతిరావు, సిబ్బంది హెచ్‌సీ బి.మాధవిదేవి, ఈసీలు బి. ఆదినారాయణ, వై.సరస్వతి పాల్గొన్నట్లు సీఐ తెలిపారు. ● **రేగిడి:** మండలంలో సోమరాజుపేట గ్రామంలో ఒక కిరాణా షాపులో 15 మద్యం బాటిళ్లు పట్టుబడినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. నిందితుడిపై కేసు న మోదుచేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఎక్కడ బెల్ట్‌లు నిర్వహించినా ఉపేక్షించమని, వీరిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. తని ఖీలో సిబ్బంది ఉన్నారు.

బెట్టింగ్ కేసులో ఇద్దరి అరెస్ట్

రాజాం రూరల్: పట్టణంలోని తెలగవీధి, పుచ్చలవీధికి చెందిన ఇద్దరు వ్యక్తులు క్రికెట్ బెట్టింగ్‌లో పాల్గొనడంతో వారిపై కేసులు నమోదు చేసి రూ.18500 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు రాజాం టౌన్ సీఐ మోహనరావు శనివారం రాత్రి తెలిపారు. బెట్టింగ్ నిర్వహణకు సంబంధించిన పుస్తకాలను సైతం స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

మిమ్స్ ఉద్యోగుల అరెస్టు

నెల్లిమర్ల: నెల్లిమర్ల మిమ్స్ ఉద్యోగులపై సహోద్యోగులు చేసిన దాడుల ఘటనకు సంబంధించి మొత్తం 17 మంది నిందితులపై కేసు నమోదు చేసి, శనివారం రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ రామగణేష్ తెలిపారు. జరజాపుపేటలో మిమ్స్ హెచ్ఆర్ ఇంటిని ముట్టడి చేసిన ఘటనతో పాటు అదే గ్రామంలో ఇద్దరు ఉద్యోగులపై సహోద్యోగులు దాడిచేసిన నేపథ్యంలో మిమ్స్ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేశారు. అలాగే విజయనగరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వైఎస్ఆర్ నగర్ ప్రాంతంలో ఒక ఉద్యోగిపైన సహోద్యోగులు చేసిన దాడి ఘటనలో 12 మందిపై కేసు నమోదు చేశారు. మొత్తం 17 మందిపై కేసు నమోదు చేసి, శనివారం రిమాండ్‌కు తరించారు.

క్వారీల పరిశీలన


క్వారీలను పరిశీలిస్తున్న అధికారులు

భోగాపురం: రామచంద్రపేట గ్రామ సమీపంలో నూతనంగా నిర్వహించనున్న క్వారీ, పాత క్వారీలను రెవెన్యూ, మైనింగ్ అధికారులు శనివారం పరిశీలించారు. పాత క్వారీల కారణంగా ఇబ్బందులకు గురవుతున్నామని, మళ్లీ కొత్తగా క్వారీలు ఏవిధంగా ఏర్పాటు చేస్తారంటూ ఇటీవల రామచంద్రపేట గ్రామస్థులు నిరసన తెలియజేశారు. అలాగే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు ఈ క్వారీలను పరిశీలించారు. స్థానికులను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని వివరాలు పైఅధికారులకు నివేదించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్, సర్వేయర్ మధుకేశవరావు, మైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సోలార్ పంప్‌సెట్ ధ్వంసం

- కక్ష సాధింపు చర్యలే అంటున్న టీడీపీ నాయకుడు


ధ్వంసం చేసిన సోలార్ పంప్ సెట్

డెంకాడ: పెదతాడివాడ గ్రామంలో మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు పడాల చిన్నారావుకు చెందిన సోలార్ పంప్‌సెట్‌ను శనివారం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి, అందులోని వైర్లను దొంగిలించారు. దీనిపై ఆయన డెంకాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో వైసీపీకి చెందిన ముఖ్య నాయకులతో చర్చించి పలువురిని టీడీపీలో చేర్పించడం వల్ల తనపై కక్ష కట్టి ఇలా చేశారని ఆరోపించారు. సుమారు రూ.80వేలు నష్టం జరిగినట్టు తెలిపారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టి తనకు తగు న్యాయం చేయాలని ఆయన కోరారు.

విజయానికి సహకరించండి


కోట్ల కుటుంబాన్ని కలిసిన కళావెంకటరావు

చీపురుపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తన విజయానికి సహకరించాలని చీపురుపల్లి అసెంబ్లీ కూటమి అభ్యర్థి కిమిడి కళావెంకటరావు... కోట్ల కుటుంబానికి విజ్ఞప్తి చేశారు. మెరకముడిదాం మండలంలోని చినబంటుపల్లిలో శనివారం కోట్ల మోతీలాల్‌నాయుడు, కోట్ల కృష్ణమూర్తినాయుడు, కోట్ల సుగుణాకరరావు కుటుంబాలను ఆయన కలిసి మాట్లాడారు. ఆయన వెంట పార్టీ నాయకులు రామ్‌మల్లిక్‌నాయుడు, కెంగువ ధనుంజయ్, దన్నాన రామచంద్రుడు, బలగం వెంకటరావు, సారేపాక సురేష్, వెంపడాపు రమణమూర్తి తదితరులు ఉన్నారు.

అచ్చెన్నకు అశోక్ గజపతిరాజు పరామర్శ


కళావతమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అశోక్ గజపతిరాజు

విజయనగరం రూరల్: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తల్లి కళావతమ్మ మృతికి టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు సంతాపం వ్యక్తం చేశారు. శనివారం శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ వెళ్లి ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడులను పరామర్శించారు. కళావతమ్మ చిత్రపటానికి అశోక్ గజపతిరాజు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

బొండపల్లి: మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత యజమానులపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కె.లక్ష్మణరావు హెచ్చరించారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై శనివారం ఆయన ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. ఎక్కువగా ద్విచక్ర వాహన ప్రమాదాలు మైనర్‌ల వల్లే జరుగుతున్నాయని అన్నారు. ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలను ఎట్టి పరిస్థితుల్లో మైనర్లకు ఇవ్వరాదని ఆయన సూచించారు. అలాగే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేదంటే జరిమానాలు విధిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీతోనే సుపరిపాలన

గజపతినగరం: బీజేపీతోనే దేశంలో పేద, బడుగు, బలహీనవర్గాలకు సుపరి పాలన అందుతుందని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దేవర ఈశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక బీజేపీ కార్యాయలంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు మోదీ ప్రభుత్వం సుపరిపాలన అందించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, తౌడు తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపులపై దాడులు నిర్వహిస్తాం

గుర్ల: గ్రామాల్లో బెల్టుషాపులు నడిపినట్లయితే సహించేది లేదని గుర్ల ఎస్ఐ భాస్కరరావు అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మద్యం, సారా, మత్తుపదార్థాలు విక్రయించినట్టు తెలిస్తే చర్యలు తప్పవన్నారు. అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. అదేవిధంగా గ్రామాల్లో మద్యం తాగి గొడవలు చేసే వ్యక్తులకు కౌన్సిలింగ్ ఇస్తామని చెప్పారు. మద్యం తాగి డ్రైవింగ్ చేసేవారిపై కేసు నమోదు చేస్తామన్నారు. ప్రతి గ్రామంలో శాంతియుతంగా ఉండాలని, తగాదాలకు పోరాదని ఆయన హితవుపలికారు.

మద్యం సీసాల స్వాధీనం

డెంకాడ: మండలంలోని పెదతాడివాడ, కె.కొల్లాం ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తుల నుండి 96 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని డెంకాడ ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. ఈ మేరకు నిందితులను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు.

- **మెంటాడ:** రామభద్రపురం మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి శనివారం సుమారు 16 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని ఆంద్ర ఎస్ఐ దేవి తెలిపారు. మండలంలోని పులిగుమ్మి వాగు వద్ద అనుమానాస్పదంగా వారు సంచరిస్తుండగా పట్టుకుని, వారి వద్ద నుంచి సారా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేశామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీపురుపల్లి: స్థానిక 33 కేవీ లైన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 7గంటల నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఈఈ పూడి హరి ఒక ప్రకటనలో తెలిపారు. చీపురుపల్లి, గరివిడి పట్టణాలు, కొండపాలేం, ఎం.దుగ్గివలస, రావివలస, మెరకముడిదాం మండలంలోని గరుగుబిల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

కొండవెలగాడలో పోలీసుల కవాతు


కవాతు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

నెల్లిమర్ల: కొండవెలగాడ గ్రామంలో కేంద్ర పోలీసు బలగాలు శనివారం కవాతు నిర్వహించాయి. భోగాపురం రూరల్ సీఐ బి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు భారీఎత్తున గ్రామానికి చేరుకుని కవాతు నిర్వహించారు. ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఎన్నికల్లో పాల్గొనాలని సీఐ సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల ఏఎస్ఐ రమణమూర్తి, పోలీసులు పాల్గొన్నారు.

రేకుల షెడ్‌లో చదువులు

- శిథిలావస్థలో మోసూరువలస పాఠశాల
- నాడు-నేడు పనుల్లో జాప్యం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు


శిథిలావస్థలో ఉన్న పాఠశాల

మక్కువ: చప్పబుచ్చంపేట పంచాయతీ పరిధి మోసూరువలస ఎంపీయూపీ పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ పాఠశాలలో 30 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నాడు-నేడు ఫేజ్ టూ కింద రూ.23 లక్షలు కేటాయించారు. వీటితో పాటు అదనపు తరగతి గది, మరుగుదొడ్లు, వంటగది నిర్మించాల్సి ఉంది. రూ.10 లక్షలు మంజూరు కావడంతో అదనపు గది నిర్మాణ పనులు చేపట్టారు. సుమారు రెండేళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాలేదు. దీంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో గ్రామస్థులు, ఉపాధ్యాయులు కలసి సొంతం గా రేకుల షెడ్ నిర్మించారు. ప్రస్తుతం రేకుల షెడ్‌లో కొంతమంది... సమీ పంలోని చెట్ల కింద కొంత మంది విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించిన త్వరితగతిన అదనపు తరగతి గది పనులు పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.


రేకుల షెడ్‌లో చదువుతున్న విద్యార్థులు

వేసవి సెలవుల తర్వాత పనులు చేపడతాం

దీనిపై మండల విద్యాశాఖ అధికారి పెంట సత్యనారాయణను వివరణ కోరగా... భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాల భవనం నిర్మించేలా చర్యలు చేపడతామని తెలిపారు.

కూటమి విజయంతోనే అభివృద్ధి: సంధ్యారాణి

మక్కువ: కూటమి విజయంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. కవిరిపల్లిలో శనివారం ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. గ్రామానికి చెందిన 50 మంది యువకులు టీడీపీలో చేరగా, ఆమె వారికి కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్, పార్టీ నాయకులు మావుడి ప్రసాదరావు, డా.పి.మల్లేశ్వరరావు, సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ వ్యూహాలను తిప్పికొట్టాలి


మాట్లాడుతున్న భంజ్‌దేవ్, సంధ్యారాణి

సాలూరు: అధికార వైసీపీ దౌర్జన్యాలను, వ్యూహాలను తిప్పికొడితే కూటమి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి గెలుపు ఖాయమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్ స్పష్టం చేశారు. శనివారం సాలూరులోని సంధ్యారాణి ఇంటి వద్ద పట్టణ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అనంతరం సంధ్యారాణి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, జనసేన నాయకులు నవీన్, మండల అధ్యక్షుడు పరమేష్, జీటీ నాయుడు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు పేర్ల విశ్వేశ్వరరావు, కౌన్సిలర్లు వరలక్ష్మి, బందాపు సీతమ్మ, పప్పల మోహన్, మజ్జి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు హైజనిక్ కిట్లు పంపిణీ

గుమ్మలక్ష్మీపురం: గర్భిణులు ప్రశాంత జీవనం గడపాలని, అప్పుడే సుఖవంతమైన ప్రసవం జరుగుతుందని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ మంచుపల్లి శ్రీరాములు హితవు పలికారు. పార్వతీపురం మన్యం జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక వైటీసీలో ఉన్న 32 మంది గర్భిణులకు ఆయన హైజనిక్ కిట్లను పంపిణీ చేశారు. అలాగే దోమతెరలు, దుప్పట్లు కూడా పంపిణీ చేస్తామని తెలిపారు. వైటీసీ మేనేజర్ రాము మాట్లాడుతూ వైటీసీలో ఇప్పటివరకు 1,850 మంది గర్భిణులను ప్రసవాలకు ఆసుపత్రికి పంపగా సుమారు 1,700మందికి సుఖ ప్రసవం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు పైడి కొండలరావు, గుడ్ల హరిప్రసాద్, వైటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోండి


వన్నాంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

కొమరాడ: ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని పార్వతీపురం సీఐ రవికుమార్ అన్నారు. మండలంలోని కొట్టు, పాలెం, కెమిశీల, మాదలంగి, దళాయిపేట, వన్నాం, తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. గ్రామాల్లో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలను తెలుసుకుని అందుకు అనుగుణంగానే ప్రవర్తించాలని అన్నారు. ఈ పరిశీలనలో కొమరాడ ఎస్ఐ నీలకంఠం, తదితరులు ఉన్నారు.

టీడీపీతోనే బీసీలకు న్యాయం: జగదీశ్వరి


ప్రచారంలో పాల్గొన్న తోయిక జగదీశ్వరి

గరుగుబిల్లి: టీడీపీతోనే బీసీలకు న్యాయం చేకూరుతుందని కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి అన్నారు. రాయిందొరవలస గ్రామంలో శనివారం సాయంత్రం జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలు ఆర్థికంగా అభివృద్ధి చెందారంటే టీడీపీ కృషేనన్నారు. వైసీపీ హయాంలో గత ఐదేళ్లలో అవినీతి తప్ప అభివృద్ధి లేదని ఆమె ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు అక్కేన మధుసూదనరావు, ఎం.పురుషోత్తం నాయుడు, ఎం.తవిటినాయుడు, అంబటి తవిటినాయుడు, ముదిలిబాబు విజయవాంకుశం, కోట భరత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతో రాష్ట్రాభివృద్ధి: విజయచంద్ర


కోలాటంతో స్వాగతం పలుకుతున్న మహిళలు

సీతానగరం: చంద్రబాబుతోనే రాష్ట్రాభి వృద్ధి కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర అన్నారు. పణుకుపేట, సుభద్రసీతారాంపురం గ్రామాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు పెంట సత్యంనాయుడు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌నాయుడు ఆధ్వర్యంలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెంటు వెంకటఅప్పలనాయుడు, శేఖర్, దాసరి సత్యనారాయణ, నమ్మి లక్ష్మణ, సుజాత, బొమ్మినాయిని లక్ష్మణరావు సమక్షంలో 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

ఇరుకు గదుల్లో స్పాట్


స్పాట్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు

పార్వతీపురంటౌన్: పదో తరగతి స్పాట్ వ్యాల్యూషన్ ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్నారు. ఈనెల 1వ తేదీ నుంచి పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల, డీవీఎంఎం ఉన్నత పాఠశాలల్లో 500 మంది ఉపాధ్యాయులు ఇంగ్లీష్, సోషల్, మ్యాథ్స్, పీఎస్, ఎన్ఎస్ సబ్జెక్టులకు సంబంధించిన స్పాట్‌లో పాల్గొంటున్నారు. ఇరుకు గదులతో పాటు గత నాలుగు రోజులుగా తీవ్రమైన ఎండల వల్ల ఉక్కపోత కారణంగా ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు తరచూ విద్యుత్ అంతరాయం. ఈ విషయమై స్పాట్ డిప్యూటీ క్యాంపు అధికారులు దామోదరరావు, నారాయణస్వామిలను వివరణ కోరగా ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బీజేపీ జెండా ఆవిష్కరణ

భామిని: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం సతివాడలో ఆ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎం.రాంబాబు, కిసాన్ మోర్చ అధ్యక్షుడు దానునాయుడు, ఉమామహేశ్వ రరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను అధిగమించాలి

- ఉపాధి హామీ ఏపీవో గౌరీనాథ్

గరుగుబిల్లి: మండలానికి సంబంధించి ఈ నెలాఖరు నాటికి 1.79 లక్షల మంది వేతనదారులు ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొనేలా ఉన్నతాధికారులు లక్ష్యాన్ని నిర్దేశించినట్టు ఏపీవో గౌరీనాథ్ క్షేత్ర సహాయకులకు దిశా నిర్దేశం చేశారు. శనివారం మండల కేంద్రంలోని ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలం నుంచి రోజుకు కనీసం 7 వేల నుంచి 7,800 మంది వరకు వేతనదారులు ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొనేలా క్షేత్ర సహాయకులు చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. వేతనదారుల హాజరును ఎన్ఎంఎస్ యాప్ ద్వారా ఎప్పటికప్పుడు పంపించాల్సి ఉందని చెప్పారు. పనుల ప్రదేశంలో స్థానికుల సహకారంతో టెంట్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఏపీవో సూచించారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన గరిష్ట వేతనం రూ.300 ఈనెల ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చిందని తెలిపారు.

నిస్వార్థమైన సేవకుడిని ఎన్నుకోండి


అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ రామారావు

గుమ్మలక్ష్మీపురం: ప్రజల పట్ల అంకితభావం, బాధ్యత కలిగిన నిస్వార్థమైన సేవకుడిని నాయకుడిగా ఎన్నుకోవాలని తహసీల్దార్ రామారావు సూచించారు. స్థానిక డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన స్వీప్ ప్రోగ్రాంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రామయ్య, ఎన్ఎస్ఎస్ పీవో బిత్రినాథ, అధ్యాపకులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి గెలుపే లక్ష్యం

గుమ్మలక్ష్మీపురం: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి గెలుపే లక్ష్యంగా జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు శ్రమిస్తున్నారని నియోజకవర్గ సమన్వయ కర్త కడ్రక మల్లేశ్వరరావు అన్నారు. శనివారం ఆయన జనసేన పార్టీ నాయకులతో కలిసి గుమ్మలక్ష్మీపురంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి అభ్యర్థి గెలుపే ధ్యేయంగా పని చేస్తామన్నారు. వైసీపీని ఓడించి తీరుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి పెంటా శంకరరావు, వాన ఉపేం ద్ర, ఐటీ కో-ఆర్డినేటర్ ఎల్.రంజిత్‌కుమార్, గరుగుబిల్లి నాయకులు శంకరరావు, శేఖర్, కొమరాడ నాయకులు అనంతకుమార్, జియ్యమ్మవలస నాయకులు రాజేష్, రమేష్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

గుమ్మలక్ష్మీపురం: బీరుపాడు పంచాయతీ వాడజంగి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామంలో నాలుగు రోజుల కిందట వీచిన ఈదురు గాలులకు వాటర్ ట్యాంకు కిందపడి బద్దలయ్యింది. దీంతో తమకు తాగునీటి సమస్య ఎదురైందని ఆ గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌కుమార్ శనివారం ఆ గ్రామానికి వెళ్లి, తాత్కాలికంగా తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. డైరెక్ట్ పంపింగ్ ద్వారా గ్రామంలో ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉంచారు. త్వరలో వాటర్ ట్యాంకు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

క్లుప్తంగా..

వడగాల్పులపై అప్రమత్తం


అధికారులకు సూచనలిస్తున్న సూర్యచంద్రరావు

బాడంగి: వేసవి వడగాల్పులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల స్పెషలాఫీసర్ సూర్యచంద్రరావు కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలపై అవగాహన


సోంపురంలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

రామభద్రపురం: సార్వత్రిక ఎన్నికల నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ జ్ఞానప్రసాద్ అన్నారు. సోంపురంలో గ్రామస్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఛత్తీస్‌ఘడ్‌లో ఎన్‌కౌంటర్

సాలూరు రూరల్: ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్ అడవుల్లో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. పూజారి కాంకేర్ అడవుల్లో ఊసూరు జోలీగుట్ట ప్రాంతంలో పోలీసులు గాలింపులు నిర్వహిస్తున్నారు. మావోయిస్టులు తారసపడడంతో ఇరువర్గాల మధ్య కాల్పులు జరిగాయి. కాల్పులు ఆగిపోయిన పిదప ఘటనా స్థలంలో ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలు, ఆయుధాలు లభ్యమయినట్టు పోలీసులు తెలిపారు.

సీఐ మంగరాజుకు సన్మానం

జియ్యమ్మవలస: చినమేరంగి సీఐ బోరపు మంగరాజును తన చిన్ననాటి స్నేహితులు ఘనంగా సన్మానించారు. మంగరాజు విశాఖపట్నం జిల్లా ఆనందపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1993 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్నారు. తమ మిత్రుడు సీఐగా పదోన్నతి చేపట్టిన సందర్భంగా బాల్యమిత్రులంతా విశాఖ నుంచి శనివారం చినమేరంగి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి, ఆయన్ని ఘనంగా సన్మానించారు.

సూపర్ సిక్స్‌పై అవగాహన

సీతానగరం: బలిజిపేటలో టీడీపీ మండల అధ్యక్షుడు పెంకి వేణుగోపాల్ నాయుడు శనివారం ప్రచారం చేశారు. ఉపాధి హామీ వేతనదారుల వద్దకు వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. బోనెల విజయచంద్రను గెలిపించాలని కోరారు. పెంకి రామ్మోహన్ తదిత రులు పాల్గొన్నారు.

సీపీఎం కురుపాం అభ్యర్థిగా రమణ

గుమ్మలక్ష్మీపురం: కురుపాం అసెంబ్లీ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థిగా మండంగి రమణను ఎంపిక చేశారు. ఈయన 20 ఏళ్లుగా సీపీఎంలో కొనసాగుతూ వివిధ పదవులు చేపట్టారు. గతంలో మూడు పర్యా యాలు సర్పంచ్‌గా, ప్రస్తుతం తాటిషీల ఎంపీటీసీగా చేస్తున్నారు.